# ఎన్టీఆర్ ఆదర్శంగా గర్జనల పరంపర

విజయవాడ - న్యూస్‌టుడే

## ప్రజాగర్జన నుంచి యువగర్జన వరకు!

ప్రజాగర్జన.. రైతుగర్జన.. బీసీగర్జన.. నేడు యువగర్జన! ఓ వ్యక్తిగా సినిమాల్లోంచొచ్చి రాష్ట్రంలో రాజకీయ శక్తిగా మారిన ఎన్టీఆర్ నిర్వహించిన సభలకు అప్పట్లో జనం తండోపతండాలుగా తరలివచ్చారు. ఆయన చేపట్టిన ప్రజా గర్జన ఓ చరిత్ర సృష్టించిందని చెప్పొచ్చు. దాన్ని ఆదర్శంగా తీసుకుని తెదేపా నేతలు వరుసగా గర్జిస్తున్నారు. నేడు(బుధవారం) యువగర్జనకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో తెదేపా ప్రస్థానం నుంచి జరిపిన భారీ సదస్సులను ఓ సారి పరికించి చూస్తే..

### ఎన్టీఆర్ స్టైలే వేరు..

1982లో ఎన్టీఆర్ తెదేపా స్థాపించిన నాటి నుంచి తన ప్రత్యేకత చాటుతూనే ఉన్నారు. మొత్తం 70 రోజుల్లో వేల కిలోమీటర్లు పర్యటించి రాజకీయ ప్రచారం చేశారు. 1982 ఏప్రిల్ 11న నిజాం కళాశాల గ్రౌండ్స్‌లో మొట్టమొదటిసారిగా నిర్వహించిన సభకు అశేషంగా జనం తరలి వచ్చారు. రామకృష్ణ స్టూడియో నుంచి నిజాం కాలేజీ వరకు ప్రదర్శన సాగితే సభా స్థలి చాలక రోడ్లపైనే ఆగిపోయిన జనంతో రాజధాని హోరెత్తింది. దాదాపు 203 స్థానాలతో అధికారంలోకి వచ్చాక 1983 జనవరి 9న ప్రమాణస్వీకారోత్సవాన్ని కూడా భారీగా తరలివచ్చిన ప్రజల మధ్య లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించి ఎన్టీఆర్ మరో చరిత్ర సృష్టించారు.

### తొలిసారి ప్రజాగర్జన

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనను అంతమొందించేందుకు అంటూ ఎన్టీఆర్ 1994 అక్టోబరు 10న ప్రజాగర్జన పేరిట నిర్వహించిన సభ నేటికీ రికార్డుగానే నిలిచింది. సుమారు 200 ఎకరాల స్థలంలో నిర్వహించిన ప్రజాగర్జనకు దాదాపు 10 లక్షలకు పైగా జనం వచ్చారని అంచనా. అంతటి జనంతో జరిగిన సభలు ఇంతవరకు లేవని నేటికీ చెప్పుకొంటారు. తొలి ప్రజాగర్జనకు జాతీయ నాయకులు వచ్చారు. ఈ సదస్సుకు సమన్వయకర్తగా వ్యవహరించిన చంద్రబాబు, పార్లమెంటరీ పార్టీ నాయకుడుగా వెంకటేశ్వరరావు గర్జనను విజయవంతం చేయడానికి దోహదపడ్డారు.

### రైతుగర్జన

2004లో తెదేపా అధికారం కోల్పోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత చాలా కాలం స్తబ్దుగా ఉన్న పార్టీ ఎన్నికలకు ఏడాది ముందునుంచి తిరిగి ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలు చేపట్టింది. 2007 నవంబరు 24న యూఎన్‌పీఏ జాతీయ నాయకులను పిలిపించి మద్దతు ధరల కోసం పోరాటమంటూ విజయవాడలో రైతు గర్జన నిర్వహించింది. బెజవాడ పంచెకట్టిందా అనిపించే రీతిలో రాష్ట్రం నలుమూలల నుంచీ రైతులు ఊహించని రీతిలో తరలివచ్చినా.. ప్రజాగర్జనను మరిపించలేదని నాయకుల భావన.

### బీసీ గర్జన

గర్జనల పరంపరలో భాగంగా తెలంగాణ ప్రాంతంలో మరో సదస్సు నిర్వహించ తలపెట్టిన పార్టీ వరంగల్‌లో ఈ ఏడాది జనవరి 23న బీసీ గర్జన నిర్వహించింది. హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన ఈ సదస్సుకు జనం భారీగానే తరలివచ్చారు. బీసీల సమస్యల పరిష్కారం కోసమంటూ 93 ఉపకులాలకు సంబంధించి 64 హామీలతో ప్రత్యేక ఆర్థిక విధానం కల్పించాలని సదస్సు ఆమోదించింది.

గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలో తలపెట్టిన యువగర్జనను మరో మరచిపోలేని సదస్సుగా నిర్వహిస్తామని తెదేపా ఘంటాపథంగా చెబుతోంది. 1994 ప్రజాగర్జనను తలదన్నే రీతిలో ఉంటుందని గర్జన సమన్వయకర్త యనమల రామకృష్ణుడు అంటున్నారు. ఈ సభకు దాదాపు 20 లక్షల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 1983లో తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు 125 మంది పట్టభద్రులకు, 20 మంది వైద్యులకు, 8 మంది ఇంజినీర్లకు, 28 మంది పోస్టుగ్రాడ్యుయేట్లకు స్థానం కల్పించి ఎక్కువ మంది చదువరులను శాసనసభకు పంపిన పార్టీగా తెదే చరిత్ర సృష్టించింది. యువకులకు తిరిగి పెద్దపీట వేసేలా, ద్వితీయ శ్రేణికి నాయకత్వం కల్పించే దిశగా సాగుతున్న ఈ యువగర్జనకు కూడా రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్న స్పందన భారీగానే కనిపిస్తోంది.



ఎన్టీఆర్ ప్రభంజనం..






విజయవాడలో 2007లో జరిగిన రైతు గర్జనలో చంద్రబాబు